

రాయలసీమ దరువు

APTEL/26/A7874

www.rayalaseemadaruvu.com

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

నూతనంగా వెలువడుతున్న 'రాయలసీమ దరువు' తెలుగు దినపత్రికలో పని చేయుటకు విలేకరులు కావలెను. చట్టాలపై అవగాహన ఉండి రాజకీయ విశ్లేషణ, సమస్యల పట్ల అవగాహన, వినూత్న శైలిలో వార్లఉ రాయగలిగే వారికి ప్రాధాన్యత ఇవ్వబడును.

94940 390303
85010 70080

ప్రచురణ : శ్రీ సత్యసాయి/అనంతపురం | ఎడిటర్ : ఎనుముల కుల్లాయప్ప | శనివారం 10 - అక్టోబర్ - 2026 | సంపుటి : 01 సంచిక : 20 | పేజీలు : 04, వెల రూ.2

అమరావతిలో చెస్ అకాడమీ..
కోనేరు హంపికి మంత్రి లోకేశ్ హామీ

- మంత్రి నారా లోకేశ్‌తో భేటీ అయిన చెస్ గ్రాండ్‌మాస్టర్ కోనేరు హంపి
- అమరావతిలో చెస్ అకాడమీ ఏర్పాటుకు సహకరించాలని విజ్ఞప్తి
- హంపి ప్రతిపాదనకు సానుకూలంగా స్పందించిన మంత్రి
- ప్రభుత్వపరంగా పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని హామీ
- ఒలింపియాడ్ పతకాల విజేత హంపిని అభినందించిన లోకేశ్

2లో..



బీసీలకు 34 శాతం రిజర్వేషన్లపై
వెనక్కి తగ్గేది లేదు..

- ఇది మా విధానం : టీడీపీ
- స్థానిక సంస్థల్లో బీసీలకు 34శాతం రిజర్వేషన్ల అమలుపై కీలక ప్రకటన
- చట్టపరంగా వీలుకాకపోయినా పార్టీపరంగా సీట్లు కేటాయిస్తాం
- వైసీపీ వల్లే బీసీలు రిజర్వేషన్లు కోల్పోయారని టీడీపీ ఆరోపణ
- గత, ప్రస్తుత ప్రభుత్వాల్లో బీసీల కోసం అమలు చేస్తున్న పథకాల వెల్లడి
- బీసీల రాజకీయ ఎదుగుదలకు ఎప్పుడూ అండగా ఉంటాం

2లో..

రూ.20లక్షల కోట్ల పెట్టుబడులే లక్ష్యం

- పారిశ్రామికవేత్తల్లో భరోసా నింపుతున్నామన్న నాదెండ్ల
- పారిశ్రామిక ప్రగతితో యువతకు భారీగా ఉద్యోగాలు కల్పిస్తామని హామీ : నాదెండ్ల మనోహర్



అమరావతి, అక్టోబర్ 09 :

ఆంధ్రప్రదేశ్‌కు రూ.20 లక్షల కోట్ల విలువైన పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా టీడీపీ-జనసేన కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. పారిశ్రామిక రంగానికి పెద్దపీట వేస్తూ, యువతకు భారీ స్థాయిలో ఉపాధి అవకాశాలు కల్పించడమే తమ ప్రభుత్వ ప్రధాన అజెండా అని ఆయన స్పష్టం చేశారు. పారదర్శక విధానాలు,

-మిగతా 2లో

నోయిడా విమానాశ్రయానికి మోదీ పేరు.!

- యోగి సర్కారు కీలక నిర్ణయం!
- పేరుమార్పు తీర్మానానికి యోగి మంత్రివర్గం ఆమోదం
- మోదీ 25 ఏళ్ల ప్రజా జీవితం పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్ణయం
- మోదీకి రాష్ట్రంతో ప్రత్యేక అనుబంధం ఉందన్న యోగి
- విమానాశ్రయం తొలి దశను మార్చిలో ప్రారంభించిన ప్రధాని మోదీ
- తొలి దశలో ఏడాదికి 1.2 కోట్ల మంది ప్రయాణికులకు సేవలు



ఉత్తరప్రదేశ్, అక్టోబర్ 09 :

ఉత్తర్‌ప్రదేశ్‌లోని నోయిడాలో ఉన్న జెవార్ అంతర్జాతీయ విమానాశ్రయం పేరును మార్చాలని యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వం నిర్ణయించింది. ఇకపై ఈ విమానాశ్రయాన్ని 'నరేంద్ర మోదీ అంతర్జాతీయ విమానాశ్రయం'గా పిలవనున్నారు. ప్రధాని మోదీ ప్రజా సేవలో 25 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ వెల్లడించారు. ఈ మేరకు రాష్ట్ర మంత్రివర్గం తీర్మానాన్ని ఆమోదించిందని తెలిపారు. శుక్రవారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో మొత్తం 39 ప్రతిపాదనలకు ఆమోదం లభించింది. అనంతరం మీడియాతో మాట్లాడిన యోగి.. దేశ, రాష్ట్ర అభివృద్ధిలో మోదీ 25 ఏళ్ల ప్రజా సేవ కీలక పాత్ర పోషించిందని పేర్కొన్నారు. ఉత్తర్‌ప్రదేశ్‌తో ప్రధానికి ప్రత్యేక అనుబంధం ఉందని, వారణాసి నుంచి ఎంపీగా ఎన్నికైన ఆయన నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధిలో ముందుకు సాగుతోందని చెప్పారు. 2017కు ముందు రాష్ట్రంలో మౌలిక సదుపాయాలు అంతంతమాత్రంగానే ఉండేవని యోగి పేర్కొన్నారు. ప్రస్తుతం ఎక్స్‌ప్రెస్‌వేలు, జాతీయ రహదారులు, మెట్రో, రీజినల్ ర్యాపిడ్ ట్రాన్సిట్ వ్యవస్థలతో రవాణా సౌకర్యాలు గణనీయంగా మెరుగయ్యాయని తెలిపారు. అయోధ్య రామమందిర నిర్మాణం, కాశీ విశ్వనాథ్ కారిడార్ అభివృద్ధి వంటి కార్యక్రమాలను కూడా ప్రస్తావించారు. జెవార్‌లో నిర్మిస్తున్న నోయిడా విమానాశ్రయం ఉత్తర్‌ప్రదేశ్‌కు అందించిన గొప్ప బహుమతిగా యోగి అభివర్ణించారు. ఇది భవిష్యత్తులో దేశంలోనే కీలక విమానయాన కేంద్రంగా ఎదుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ విమానాశ్రయం తొలి దశను ప్రధాని మోదీ ఈ ఏడాది మార్చిలో ప్రారంభించారు. మొదటి దశలో ఏడాదికి సుమారు 1.2 కోట్ల మంది ప్రయాణికులకు సేవలందించే సామర్థ్యం ఉండనుంది. నాలుగు దశల నిర్మాణం పూర్తయితే ఆసియాలోనే అతిపెద్ద విమానాశ్రయాల్లో ఒకటిగా నిలవనుంది.

భారత నిపుణులు 'వెట్టిచాకిరీ బానిసలా'?
జేడీ వాన్స్ వ్యాఖ్యలపై భారత్ తీవ్ర ఆగ్రహం

- భారత ఐటీ నిపుణులను 'వెట్టిచాకిరీ బానిసలు' అన్న అమెరికా జేడీ వాన్స్
- 8 ప్రముఖ ఐటీ కంపెనీల గ్రీన్ కార్డ్ ప్రక్రియను నిలిపివేసిన అమెరికా
- జేడీ వాన్స్ వ్యాఖ్యలు తీవ్ర అభ్యంతరకరం, అవమానకరం అన్న భారత విదేశాంగ శాఖ
- భారత నిపుణులు అమెరికా అభివృద్ధిలో కీలక భాగస్వాములని స్పష్టీకరణ
- ఈ నిర్ణయం ఇరు దేశాల ఉమ్మడి లక్ష్యాలకు విఘాతమని భారత్ వ్యాఖ్య




నెట్‌వర్క్, అక్టోబర్ 09 :

భారత ఐటీ నిపుణులను 'విదేశీ వెట్టిచాకిరీ బానిసలు' అంటూ అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ చేసిన వ్యాఖ్యలపై భారత్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ వ్యాఖ్యలు అత్యంత అనుచితమని, భారతీయ నిపుణులను అవమానించేలా ఉన్నాయని పేర్కొంది. ఎనిమిది ప్రముఖ టెక్నాలజీ సంస్థలకు సంబంధించి పర్మనెంట్ లేబర్ సర్టిఫికేషన్ ప్రక్రియను అమెరికా నిలిపివేసిన నేపథ్యంలో ఈ వివాదం చెలరేగింది. అమెరికన్ ఉద్యోగులను తొలగించి, వారి స్థానంలో తక్కువ వేతనాలకు హెచ్-1బీ

-మిగతా 2లో

కోర్టు తీర్పుతో సంబంధం లేకుండా
బీసీలకు అండగా ఉంటాం : సీఎం

- బీసీ రిజర్వేషన్లపై సుప్రీంకోర్టు తీర్పుపై చంద్రబాబు స్పందన
- 34 శాతం బీసీ రిజర్వేషన్లపై ఏపీ ప్రభుత్వ పిటిషన్ కొట్టివేత
- 50 శాతం రిజర్వేషన్ల పరిమితి దాటరాదన్న హైకోర్టు తీర్పును సమర్థించిన సుప్రీంకోర్టు



వివరాలు 2లో

'సర్' అక్రమాలపై సుప్రీం విచారణ జరపాలి..
సీఈసీ రాజీనామా చేయాలి : కేటీఆర్


- సర్ ప్రక్రియలో భారీ అక్రమాలు జరిగాయన్న కేటీఆర్
- బీఆర్ఎస్ ఎమ్మెల్యేల నియోజకవర్గాల్లో ఓట్లు తొలగించారని ఆరోపణ
- సీఈసీకి వ్యతిరేకంగా రేపు హైదరాబాద్‌లో బీఆర్ఎస్ నిరసన



వివరాలు 2లో

భద్రతా వలయంలో ఢిల్లీ!

- సీఈసీకి వ్యతిరేకంగా ప్రతిపక్షాల భారీ నిరసనలకు పిలుపు
- ఢిల్లీలో 20 వేల మంది బలగాలతో కఠిన భద్రతా ఏర్పాట్లు
- 57 మెట్రో స్టేషన్ల మూసివేయాలన్న పోలీసులు.. పలు రైళ్ల సర్వీసులు రద్దు
- జంతర్ మంతర్ వద్ద నిరసనకు పోలీసుల అనుమతి నిరాకరణ
- పరిస్థితిపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఉన్నతస్థాయి సమీక్షలు



వివరాలు 2లో

జనసేన ఎమ్మెల్యే బాలరాజుపై పవన్ సీరియస్..

- పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజుపై విచారణకు కమిటీ
- జనసేన అధినేత పవన్ కల్యాణ్ కీలక ఆదేశాలు జారీ
- బాలరాజు వ్యవహారశైలిపై తీవ్ర అసంతృప్తితో ఉన్న పవన్
- గతంలో హెచ్చరించినా తీరు మారకపోవడంతో ఆగ్రహం
- కమిటీ నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు ఉంటాయని ప్రకటన



అమరావతి, అక్టోబర్ 09 :

జనసేన పార్టీకి చెందిన పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజుపై వస్తున్న ఆరోపణల వ్యవహారంపై డిప్యూటీ సీఎం, పార్టీ అధినేత పవన్ కల్యాణ్ తీవ్రంగా స్పందించారు. బాలరాజుపై వచ్చిన ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపేందుకు పవన్ కల్యాణ్ ఒక ఉన్నత స్థాయి కమిటీని నియమిస్తున్నట్లు జనసేన పార్టీ కేంద్ర కార్యాలయం శుక్రవారం ఒక ప్రకటనలో వెల్లడించింది. ఈ నిర్ణయం పార్టీలో అంతర్గతంగా కలకలం రేపుతోంది. గత కొంతకాలంగా ఎమ్మెల్యే బాలరాజు వ్యవహారశైలి, పనితీరుపై పవన్ కల్యాణ్ తీవ్ర అసంతృప్తితో ఉన్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. ఇటీవల మీడియాలో ఆయనపై ఆరోపణలు రావడంతో ఈ వ్యవహారాన్ని అధిష్ఠానం సీరియస్‌గా తీసుకుంది. గతంలోనే బాలరాజును పార్టీ కార్యాలయానికి పిలిపించి, గిరిజన ప్రజలకు పారదర్శకమైన, నీతివంతమైన పాలన అందించాలని, వారి సేవకే అంకితం కావాలని పవన్ కల్యాణ్ వ్యక్తిగతంగా సూచించారు. అయినప్పటికీ ఆయన ప్రవర్తనలో మార్పు రాకపోవడంపై పవన్ తీవ్ర అసహనం, విసుగుతో ఉన్నట్లు పార్టీ ప్రకటనలో పేర్కొన్నారు. ఓవైపు 'అడవితల్లి బాట' వంటి కార్యక్రమాల ద్వారా గిరిజన ప్రాంతాల అభివృద్ధికి పార్టీ కృషి చేస్తుంటే, అదే గిరిజన ప్రాంతం నుంచి ఎన్నికైన ప్రజాప్రతినిధి వ్యవహారశైలిపై వస్తున్న ఆరోపణలు పార్టీకి ఇబ్బందికరంగా మారాయి. ఈ నేపథ్యంలోనే పవన్ కల్యాణ్ ఈ విచారణకు ఆదేశించినట్లు తెలుస్తోంది. ఈ కమిటీ క్షేత్రస్థాయిలో విచారణ జరిపి, వాస్తవాలను నిగ్గు తేల్చి, పార్టీ అధ్యక్షుడికి నివేదిక సమర్పించనుంది. ఆ నివేదిక ఆధారంగా ఎమ్మెల్యే చిర్రి బాలరాజుపై తదుపరి చర్యలు ఉంటాయని జనసేన పార్టీ స్పష్టం చేసింది. దీంతో బాలరాజు రాజకీయ భవిష్యత్తుపై ఉత్కంఠ నెలకొంది.

14న విజయవాడకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

- దసరా ఉత్సవాల్లో భాగంగా ఇంద్రకీలాద్రికి రానున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము
- అక్టోబర్ 16న అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించనున్న సీఎం చంద్రబాబు
- పది రోజుల పాటు రూ.100, రూ.300, రూ.500 దర్శన టికెట్లు రద్దు



విజయవాడ, అక్టోబర్ 09 :

విజయవాడ ఇంద్రకీలాద్రిపై జరగనున్న దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పాల్గొననున్నారు. అక్టోబర్ 14వ తేదీన ఆమె దుర్గమ్మను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేయనున్నారు. ఈ నేపథ్యంలో అధికారులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. అక్టోబర్ 11 నుంచి 20వ తేదీ వరకు పది రోజులపాటు ఈ ఉత్సవాలు అత్యంత వైభవంగా జరగనున్నాయి. రాష్ట్రపతితోపాటు, ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా అమ్మవారిని దర్శించుకోనున్నారు. అక్టోబర్ 16న మూలా నక్షత్రం రోజున ఆయన రాష్ట్ర ప్రభుత్వం తరఫున కనకదుర్గమ్మకు పట్టువస్త్రాలు సమర్పించనున్నారు. ఈ ఉత్సవాలకు సుమారు 20లక్షల నుంచి 25లక్షల మంది భక్తులు వస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆలయ దర్శన టికెట్ల విషయంలో కీలక నిర్ణయం తీసుకుంది. ఉత్సవాలు జరిగే పది రోజుల పాటు రూ.100, రూ.300, రూ.500 ధర గల దర్శన టికెట్లను పూర్తిగా రద్దు చేసింది. కేవలం ఉచిత దర్శనంతో పాటు, త్వరితగతిన దర్శనం కోరుకునే వారి కోసం రూ.1000 ప్రత్యేక శీఘ్రదర్శనం టికెట్‌ను మాత్రమే అందుబాటులో ఉంచింది. ఈ టికెట్లను 'మన మిత్ర' వాట్సాప్ సేవ ద్వారా పొందవచ్చని అధికారులు తెలిపారు. సామాన్య భక్తులకు ఇబ్బంది లేకుండా దర్శనం కల్పించేందుకు ప్రాధాన్యత ఇస్తున్నామని, ఉదయం 6 నుంచి 8 గంటల వరకు మాత్రమే ప్రోటోకాల్, వీఐపీ దర్శనాలకు సమయం కేటాయించినట్లు ఆలయ ఈవో వి.కె. శీనా నాయక్ తెలిపారు. రద్దీని బట్టి సాయంత్రం వేళ కూడా వీఐపీ దర్శనాలకు మరో స్లాట్ కేటాయించే అవకాశం ఉందని వివరించారు. భక్తుల కోసం భారీ క్యూ కాంప్లెక్స్‌లు, ఇతర మౌలిక సదుపాయాలను సిద్ధం చేశారు.

స్థానిక ఎన్నికలు ఆపేందుకు వైసీపీ కుట్ర

- మంత్రి కొల్లు రవీంద్ర
- ఎన్నికలు జరగకపోతే రూ.12,500 కోట్ల కేంద్ర నిధులు ఆగిపోతాయని వెల్లడి
- బీసీలకు 34శాతం రిజర్వేషన్లు ఇచ్చేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టీకరణ
- గతంలో వైసీపీయే రిజర్వేషన్లను 24 శాతానికి తగ్గించిందని విమర్శ
- ఓటమి భయంతోనే వైసీపీ కోర్టులకు వెళ్లి ఎన్నికలను అడ్డుకుంటోందని వ్యాఖ్య



అమరావతి, అక్టోబర్ 09 :

వైసీపీ స్థానిక సంస్థల ఎన్నికలను అడ్డుకునేందుకు కుట్రలు పన్నుతోందని, తద్వారా రాష్ట్రానికి రావాల్సిన రూ. 12,500 కోట్ల ఆర్థిక సంఘం నిధులను నిలిపివేయాలని చూస్తోందని రాష్ట్ర ఎక్సైజ్, బీసీ సంక్షేమ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు. శుక్రవారం మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. స్వర్గీయ ఎన్టీఆర్ బీసీలకు రాజకీయ రిజర్వేషన్ల పునాది వేయగా, ముఖ్యమంత్రి చంద్రబాబు వాటిని 34 శాతానికి పెంచి వారి ఆత్మగౌరవాన్ని ఇనుమడింపజేశారని కొల్లు రవీంద్ర గుర్తుచేశారు. అయితే, గత ప్రభుత్వం కుట్రపూరితంగా కోర్టుల ద్వారా ఈ రిజర్వేషన్లను 24 శాతానికి తగ్గించి బీసీలకు తీవ్ర అన్యాయం చేసిందని విమర్శించారు. దీనివల్ల దాదాపు 16,800 మంది బీసీలు రాజ్యాంగబద్ధమైన పదవులను కోల్పోయారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల హామీ మేరకు 34 శాతం రిజర్వేషన్ల అమలుపై అసెంబ్లీలో తీర్మానం చేశామని, దీనిపై ఏర్పాటు చేసిన రాజీవ్ రంజన్ మిశ్రా నేతృత్వంలోని బీసీ కమిషన్ నివేదిక త్వరలో ప్రభుత్వానికి అందనుందని మంత్రి తెలిపారు. స్థానిక సంస్థల పదవీకాలం ముగిసినందున 16వ ఆర్థిక

-మిగతా 2లో

బీసీలకు 34 శాతం రిజర్వేషన్లపై వెనక్కి తగ్గేది లేదు : టీడీపీ

అమరావతి, అక్టోబర్ 09 :

సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించే విషయంలో తెలుగుదేశం పార్టీ తన విధానాన్ని స్పష్టం చేసింది. చట్టపరమైన ఆమోదం లభించకపోయినా, పార్టీ తరఫున బీసీలకు 34 శాతం సీట్లు కేటాయించి వారి రాజకీయ గౌరవాన్ని కాపాడతామని కీలక ప్రకటన చేసింది. గతంలో తాము అధికారంలో ఉన్నప్పుడు బీసీలకు జరిగిన నష్టాన్ని భర్తీ చేసేందుకు జీవో 105, 1065 ద్వారా 34శాతం రిజర్వేషన్లు కల్పించే ప్రయత్నం చేశామని, అయితే వైసీపీ నేతలు కోర్టులకు వెళ్లడం వల్లే హైకోర్టు ఆ జీవోలను కొట్టివేసిందని టీడీపీ ఆరోపించింది. ఈ విషయంలో తాము వెనక్కి తగ్గకుండా సుప్రీంకోర్టును ఆశ్రయించామని, సీనియర్ న్యాయ వాదులను నియమించి పోరాడినా దురదృష్టవ శాత్తు అనుకూల తీర్పు రాలేదని తెలుగుదేశం పార్టీ గుర్తు చేసింది. అయినా సరే, బీసీల విషయంలో తమ నిబద్ధతను చాటుకుం టామని, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీపరంగా 34 శాతానికి తగ్గకుండా బీసీ వర్గాలకు సీట్లు కేటా యిస్తామని ఉద్ఘాటిం చింది. బీసీల రాజకీయ ఎదుగుదలకు టీడీపీ ఎప్పుడూ అండగా ఉంటుందని, వారికి న్యాయం చేయడమే తమ లక్ష్యమని, కానీ వారి హక్కులను అడ్డుకోవడమే వైసీపీ వైఖరి అని విమర్శించింది. కుట్రలు చేసి, కోర్టులకు వెళ్లి రిజర్వేషన్లు పోయేలా చేసి, మళ్లీ తమపైనే ఆరోపణలు చేయడం వైసీపీకి అలవాటుగా మారిందని దుయ్యబట్టింది. నాడు హైకోర్టు రిజర్వేషన్లు కొట్టివేసినప్పుడు అధికారంలో ఉన్న వైసీపీ, బీసీలకు న్యాయం చేసేందుకు కనీస ప్రయత్నం కూడా చేయలేదని ఆక్షేపించింది.

బీసీలకు అండగా నిలిచింది టీడీపీనే

బీసీలకు రాజ్యాధికారం అనే మాటను తొలిసారిగా పలికి, వారికి అవకాశాలు కల్పించింది తెలుగుదేశం పార్టీయేనని ఈ సందర్భంగా టీడీపీ గుర్తుచేసింది. పార్టీ వ్యవస్థాపకులు ఎన్టీఆర్ కారణంగా నాలుగు దశాబ్దాల క్రితమే బీసీల గళం వినిపించిందని, ఆ తర్వాత తాము ఆ స్ఫూర్తిని మరింత ముందుకు తీసుకెళ్లామని తెలిపింది. 1995లో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లను 34 శాతానికి పెంచిన ఘనత తమదేనని పేర్కొంది. బీసీలు తమకు అండగా ఉన్నారనే అక్కసుతోనే గత వైసీపీ ప్రభుత్వం వారిని అణగదొక్కే ప్రయత్నం చేసిందని, 30 ఏళ్లుగా అమలవుతున్న 34 శాతం రిజర్వేషన్లను 24 శాతానికి తగ్గించిందని ఆరోపించింది. దీనివల్ల సుమారు



16,800 మంది బీసీలు పదవులు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేసింది.

గత, ప్రస్తుత ప్రభుత్వాల్లో బీసీలకు మేలు

బీసీ ఫెడరేషన్లకు నాంది పలికింది కూడా తమ ప్రభుత్వమేనని టీడీపీ తెలిపింది. కులవృత్తులు, చేతివృత్తులను పరిరక్షించేందుకు, వారి జీవనోపాధిని మెరుగుపరిచేందుకు 'ఆదరణ' వంటి పథకాలను తీసుకువచ్చామని, ఈ పథకం కింద 341 రకాల పనిముట్లను 90 శాతం సబ్సిడీతో అందించామని గుర్తు చేసింది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక బీసీల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని వివరించింది. ఇందులో భాగంగా వడ్డెర్లకు 10 శాతం మైనింగ్ లీజులు, గీత కార్మికులకు 10 శాతం ఎక్సైజ్ షాపులు కేటాయించామని తెలిపింది.

▶▶ 'నేతన్న సేవ' పథకం కింద ప్రతి చేనేత కుటుంబానికి ఏడాదికి రూ.25,000 ఆర్థిక సహాయం అందిస్తున్నామని, చేనేత మగ్గాలకు నెలకు 200 యూనిట్లు, పవర్ లూమ్ మగ్గాలకు నెలకు 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నామని పేర్కొంది. వేట నిషేధ సమయంలో మత్స్యకారులకు ఆర్థిక సాయం అందించే పథకాన్ని తామే ప్రారంభించామని, ఇప్పుడు 'మత్స్యకార సేవ' పథకం కింద ఆ సహాయాన్ని రూ.20,000కు పెంచామని వివరించింది. సబ్సిడీపై బోట్లు, డీజిల్ అందిస్తూ, తీరప్రాంతంలో వారి హక్కులకు రక్షణ కల్పిస్తున్నామని తెలిపింది. గత ప్రభుత్వం అన్యాయంగా తెచ్చిన జీవో నెంబర్ 217ను రద్దు చేసి మత్స్యకార సొసైటీల హక్కులను కాపాడామని, మత్స్యకార మహిళలకు సీ వీడ్ పెంపకంపై శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పిస్తున్నామని చెప్పింది.

▶▶ నాయీ బ్రాహ్మణులు నిర్వహించే సెలూన్లకు నెలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్, దేవాలయాల్లో పనిచేసే వారికి భృతిని రూ.15,000 నుంచి రూ.25,000కు పెంచామని తెలిపింది. స్వర్ణకారుల కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేశామని పేర్కొంది. చట్టపరంగా ఏది ఏమైనప్పటికీ, రాజకీయంగా బీసీలకు ఇచ్చిన 34 శాతం రిజర్వేషన్ల హామీని నిలబెట్టుకుంటామని టీడీపీ పునరుద్ఘాటించింది.

అమరావతిలో చెస్ అకాడమీ..

కోనేరు హంపికి మంత్రి లోకేశ్ హామీ

అమరావతి, అక్టోబర్ 09 :



ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో అంతర్జాతీయ స్థాయి చెస్ అకాడమీని ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం సానుకూలత వ్యక్తం చేసింది. ఈ మేరకు ప్రఖ్యాత చదరంగ క్రీడాకారిణి, గ్రాండ్‌మాస్టర్ కోనేరు హంపి చేసిన విజ్ఞప్తి పట్ల రాష్ట్ర ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్ సానుకూలంగా స్పందించారు. అకాడమీ స్థాపనకు ప్రభుత్వం తరఫున పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని ఆయన భరోసా ఇచ్చారు. శుక్రవారం ఉండవల్లిలోని తన నివాసంలో మంత్రి లోకేశ్‌తో కోనేరు హంపి, ఆమె తండ్రి అశోక్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఇటీవల జరిగిన చెస్ ఒలింపియాడ్‌లో అద్భుత ప్రతిభ కనబరిచిన హంపిని మంత్రి ప్రత్యేకంగా అభినందించారు. ఈ టోర్నీలో భారత మహిళల జట్టు కాంస్య పతకం సాధించడంలోనూ, వ్యక్తిగత విభాగంలో బోర్డు-1పై కాంస్యం గెలవడంలోనూ హంపి పోషించిన కీలక పాత్రను ఆయన ప్రశంసించారు. భవిష్యత్ తరం క్రీడాకారులను ప్రోత్సహించే లక్ష్యంతో అమరావతిలో ఒక ప్రత్యేక చెస్ అకాడమీని ఏర్పాటు చేయాలన్న తన ఆకాంక్షను హంపి మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఈ బృహత్కార్యానికి ప్రభుత్వం మద్దతుగా నిలవాలని ఆమె కోరారు. దీనిపై తక్షణమే స్పందించిన మంత్రి లోకేశ్, రాష్ట్రంలో క్రీడల అభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. అకాడమీ ఏర్పాటుకు అవసరమైన అన్ని రకాల సహాయాన్ని అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ నిర్ణయంతో ఆంధ్రప్రదేశ్‌లో చదరంగ క్రీడకు మరింత ప్రోత్సాహం లభించనుంది.

రూ. 20 లక్షల కోట్ల పెట్టుబడులే లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)



పరిశ్రమలకు వేగవంతమైన అనుమతులు, పారిశ్రామికవేత్తలకు అనుకూలమైన వాతావరణం సృష్టించడం ద్వారా రాష్ట్ర ఆర్థిక ముఖచిత్రాన్ని మార్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని మనోహర్ వివరించారు. గత వైసీపీ పాలనలో నెలకొన్న అనిశ్చితిని తొలగించి, పారిశ్రామిక వర్గాల్లో మళ్లీ భరోసా నింపడంలో తమ ప్రభుత్వం విజయం సాధించిందని ఆయన పేర్కొన్నారు. గత ప్రభుత్వాన్ని విమర్శిస్తూ, స్థానిక సంస్థల ఎన్నికల్లో సైతం వైసీపీ బెదిరింపు రాజకీయాలకు పాల్పడిందని మనోహర్ ఆరోపించారు. దీనివల్ల ప్రజాస్వామ్య విలువలు దెబ్బతిని, ప్రజలు స్వేచ్ఛను కోల్పోయారని అన్నారు. ప్రస్తుత ప్రభుత్వం రాష్ట్రంలో భయరహిత వాతావరణాన్ని నెలకొల్పిందని, శాంతిభద్రతలు, పౌర హక్కులకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన వైసీపీ రాజకీయ భవిష్యత్తుపై జోస్యం చెప్పారు. రానున్న ఎన్నికల్లో ప్రస్తుతం ఆ పార్టీకి ఉన్న 11 అసెంబ్లీ స్థానాలు కూడా దక్కవని, వైసీపీ పతనం అనివార్యమని అన్నారు. ప్రజలు ఇప్పటికే గత పాలనను తిరస్కరించారని, సంక్షేమం, అభివృద్ధిపై కూటమి ప్రభుత్వం చూపుతున్న చొరవపై బలమైన విశ్వాసంతో ఉన్నారని ఆయన ధీమా వ్యక్తం చేశారు.


భారత నిపుణులు 'వెట్టిచాకిరీ బానిసలా'?

▶ జేడీ వాన్స్ వ్యాఖ్యలపై భారత్ తీవ్ర ఆగ్రహం

(మొదటి పేజీ తరువాయి)

వీసాదారులను నియమించుకుంటున్నారన్న ఆరోపణలతో మైక్రోసాఫ్ట్, ఇన్ఫోసిస్, టీసీఎస్, విప్రో సహా ఎనిమిది దిగ్గజ సంస్థలపై అమెరికా కార్మిక శాఖ ఈ చర్యలు చేపట్టింది. ఈ నిర్ణయాన్ని సమర్థిస్తూ మాట్లాడిన జేడీ వాన్స్, కంపెనీలు స్థానిక అమెరికన్ల కంటే తక్కువ వేతనాలకు లభించే విదేశీ నిపుణులకే ప్రాధాన్యత ఇస్తున్నాయని ఆరోపించారు. ఈ క్రమంలోనే ఆయన భారతీయ నిపుణులను ఉద్దేశిస్తూ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. జేడీ వాన్స్ వ్యాఖ్యలను భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ (వీజూ) తీవ్రంగా ఖండించింది. 'ఇలాంటి పదజాలం వాడటం అనవసరం. ఇది బాధాకరమైన వలసవాద చరిత్రను గుర్తుచేస్తోంది. ఇది తీవ్రంగా అవమానపరిచే చర్య' అని ఒక ప్రకటనలో స్పష్టం చేసింది. అమెరికాలో సేవలందిస్తున్న భారతీయ నిపుణులు అత్యంత విద్యావంతులని, మేధావులని, ఆ దేశ ఆర్థికాభివృద్ధికి, నూతన ఆవిష్కరణలకు వారు ఎంతో దోహదపడుతున్నారని భారత్ ఈ సందర్భంగా గుర్తుచేసింది. అంతేకాకుండా, లేబర్ సర్టిఫికేషన్ ప్రక్రియ నిలిపివేతకు, హెచ్-1బీ వీసాలకు నేరుగా సంబంధం లేదని విదేశాంగ శాఖ స్పష్టం చేసింది. ఈ నిర్ణయం వల్ల ప్రస్తుతం ఉన్న వీసాదారులపై తక్షణ ప్రభావం ఉండకపోయినప్పటికీ, ఆయా కంపెనీల్లో పనిచేసే వారి గ్రీన్ కార్డ్ దరఖాస్తులపై ప్రభావం పడే అవకాశం ఉందని వివరించింది. నైపుణ్యం కలిగిన మానవ వనరుల రాకపోకలు ఇరు దేశాలకూ ప్రయోజనకరమని, అమెరికా తీసుకున్న ఇటువంటి చర్యలు ఉమ్మడి లక్ష్యాలకు విఘాతం కలిగిస్తాయని భారత్ పేర్కొంది. ప్రస్తుతం అమెరికాలో సుమారు 52 లక్షల మంది భారత సంతతి ప్రజలు ఉన్నట్లు అంచనా వేస్తూ, తాజా పరిణామాలను నిశితంగా గమనిస్తున్నట్లు భారత్ వెల్లడించింది.

భద్రతా వలయంలో ఢిల్లీ!



న్యూ ఢిల్లీ, అక్టోబర్ 09 :

ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా కాక్రోచ్ జనతా పార్టీ, ప్రతిపక్ష ఇండియా కూటమి తలపెట్టిన భారీ నిరసనల నేపథ్యంలో దేశ రాజధాని ఢిల్లీ కట్టుదిట్టమైన భద్రతా వలయంలోకి వెళ్లింది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా కేంద్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. 20వేల మందికి పైగా పోలీసులు, పారామిలిటరీ బలగాలను మోహరించి, దేశ రాజధానిలో భారీ భద్రతా ఏర్పాట్లు చేసింది. పరిస్థితి తీవ్రత దృష్ట్యా కేంద్ర హోంమంత్రి అమిత్ షా తన అధికారిక పర్యటనలు, అపాయింట్‌మెంట్లు రద్దు చేసుకున్నారు. గత రెండు రోజులుగా ఆయన ఉన్నతాధికారులతో సమీక్షలు నిర్వహిస్తూ, భద్రతా చర్యలను స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. మరోవైపు, ఈరోజు జంతర్ మంతర్ వద్ద తలపెట్టిన నిరసన ప్రదర్శనకు పోలీసులు అనుమతి నిరాకరించారు. భద్రతా చర్యల్లో భాగంగా, ఢిల్లీలోని 57 మెట్రో స్టేషన్లను రెండు రోజుల పాటు మూసివేయాలని పోలీసులు మెట్రో అధికారులను కోరారు. అలాగే, న్యూఢిల్లీ, హజ్రత్ నిజాముద్దీన్ స్టేషన్లకు వచ్చే పలు రైళ్లను ఈరోజు రద్దు చేస్తున్నట్లు రైల్వే శాఖ ప్రకటించింది. జంతర్ మంతర్ పరిసరాల్లో సీసీటీవీలు, ఫేషియల్ రికగ్నిషన్ కెమెరాలతో నిఘాను కట్టుదిట్టం చేశారు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ నివాసం, ఈసీ కార్యాలయం వద్ద ఇప్పటికే ఉన్న జడ్+ భద్రతతో పాటు భారీగా భద్రతను పెంచారు. ఇదిలా ఉండగా, ఢిల్లీకి వస్తున్న తమ కార్యకర్తలను నాగ్‌పుర్, భోపాల్ వంటి నగరాల్లోనే పోలీసులు అడ్డుకుంటున్నారని సీజేపీ నేతలు ఆరోపిస్తున్నారు. సోషల్ మీడియా పోస్టులపై కూడా ప్రత్యేక నిఘా పెట్టినట్లు అధికారులు వెల్లడించారు.

కోర్టు తీర్పుతో సంబంధం లేకుండా..

బీసీలకు అండగా ఉంటాం : చంద్రబాబు

అమరావతి, అక్టోబర్ 09 :



స్థానిక సంస్థల ఎన్నికల్లో వెనుకబడిన తరగతులకు (బీసీ) 34 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రయత్నాలకు సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. ఈ అంశంపై రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన స్పెషల్ లీవ్ పిటిషన్‌ను సర్వోన్నత న్యాయస్థానం ఈరోజు కొట్టివేసింది. మొత్తం రిజర్వేషన్లు 50 శాతానికి మించరాదంటూ గతంలో రాష్ట్ర హైకోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు ఈ సందర్భంగా సమర్థించింది. ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లతో కలిపి మొత్తం కోటా 50 శాతం మించకూడదన్న నిబంధనను హైకోర్టు గుర్తుచేయడం సమంజసమేనని సుప్రీంకోర్టు తన తీర్పులో పేర్కొంది. సుప్రీంకోర్టు తీర్పు వెలువడిన వెంటనే ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందించారు. న్యాయస్థానాల తీర్పులు ఎలా ఉన్నప్పటికీ, తమ కూటమి ప్రభుత్వం బీసీలకు పూర్తిస్థాయిలో రాజకీయంగా అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ అభ్యర్థులకు పార్టీ తరఫున అధిక శాతం సీట్లు కేటాయించి, వారి రాజకీయ ప్రాధాన్యాన్ని కాపాడతామని స్పష్టం చేశారు. బీసీలకు తమ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యతను ఇస్తుందని తెలిపారు. బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు దక్కడాన్ని వైసీపీ సహించలేకపోయిందని చంద్రబాబు ఆరోపించారు. అందుకే కోర్టులకు వెళ్లి, బీసీల రాజకీయ వాటాను అడ్డుకునేందుకు ప్రయత్నించిందని విమర్శించారు. గత వైసీపీ ప్రభుత్వం బీసీల కోటాను 34 శాతం నుంచి 24 శాతానికి తగ్గించడం వల్ల బీసీలు సుమారు 16,800 పదవులు కోల్పోయారని ఆయన గుర్తుచేశారు.

బీసీలకు 34 శాతం రిజర్వేషన్లపై వెనక్కి తగ్గేది లేదు

అమరావతి, అక్టోబర్ 09 :

- ఎమ్మెల్యే గల్లా మాధవి
- సుప్రీంకోర్టు తీర్పును గౌరవిస్తూనే బీసీలకు న్యాయం చేసేందుకు కట్టుబడి ఉన్నామని వ్యాఖ్య
- 34 శాతం రిజర్వేషన్లను 24 శాతానికి ఎందుకు తగ్గించారో వైసీపీ సమాధానం చెప్పాలని డిమాండ్
- వైసీపీ హయాంలో బీసీ సంక్షేమ నిధులు రూ.70 వేల కోట్లు దారి మళ్లాయని ఆరోపణ
- బీసీల రాజకీయ ఎదుగుదలకు వైసీపీ అడ్డుపడిందని విమర్శలు

స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించాలనే లక్ష్యానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే గల్లా మాధవి స్పష్టం చేశారు. సుప్రీంకోర్టు తీర్పును గౌరవిస్తూనే, పార్టీ పరంగా బీసీలకు న్యాయం చేసేందుకు తమ వంతు కృషి చేస్తామని ఆమె తేల్చిచెప్పారు. శుక్రవారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ, బీసీల రిజర్వేషన్ల అంశంపై వైసీపీ ద్వంద్వ వైఖరిని అవలంబిస్తోందని తీవ్రంగా విమర్శించారు. స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించడం సాధ్యం కాదంటూ గతంలో హైకోర్టు ఇచ్చిన తీర్పునే సుప్రీంకోర్టు సమర్థించిందని గల్లా మాధవి గుర్తుచేశారు. అయినప్పటికీ, తమ ప్రభుత్వం బీసీల సంక్షేమానికి మొదటి నుంచి కట్టుబడి ఉందన్నారు. స్వర్గీయ ఎన్టీ రామారావు బీసీలకు 20 శాతం రిజర్వేషన్లతో రాజకీయ ప్రాతినిధ్యం కల్పిస్తే, చంద్రబాబు దానిని 34 శాతానికి పెంచి వారి జీవితాల్లో సుస్థిరమైన మార్పు తీసుకొచ్చారని వివరించారు. ఈ లక్ష్యం సాధనలో ఎట్టి పరిస్థితుల్లోనూ వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని ఆమె పునరుద్ఘాటించారు. ఈ అంశంపై వైసీపీ తీరును గల్లా మాధవి తీవ్రంగా తప్పుబట్టారు. '34 శాతం



రిజర్వేషన్లను వ్యతిరేకించిన వైసీపీ, వారి ఐదేళ్ల పాలనలో వాటిని 24 శాతానికి ఎందుకు పరిమితం చేసిందో బీసీలకు సమాధానం చెప్పాలి' అని ఆమె డిమాండ్ చేశారు. గతంలో కూటమి ప్రభుత్వం 34 శాతం రిజర్వేషన్ల కోసం జీవోలు జారీ చేస్తే, వైసీపీ నేతలు కుట్ర పూరితంగా కోర్టుల్లో పిటిషన్లు వేయించారని ఆరోపించారు. వైసీపీ ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాల వల్ల బీసీలు సుమారు 16,800 రాజకీయ పదవులను కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. వైసీపీ పాలనలో బీసీ సంక్షేమానికి కేటాయించిన నిధుల్లో దాదాపు రూ.70 వేల కోట్లను దారి మళ్లించారని గల్లా మాధవి విమర్శించారు. కేవలం నామమాత్రపు కార్పొరేషన్లను ఏర్పాటు చేసి నిధులు కేటాయించలేదని, బీసీ మంత్రులను కేవలం ప్రభుత్వ కుంభకోణాలను సమర్థించుకోవడానికే వాడుకున్నారని ధ్వజమెత్తారు. కడప జిల్లాలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలోనే బీసీ నాయకత్వాన్ని అణచివేసిన చరిత్ర వారికి ఉందని, అలాంటి నేపథ్యం ఉన్నవారు ఇప్పుడు బీసీల గురించి మాట్లాడటం హాస్యాస్పదమని ఎద్దేవా చేశారు. న్యాయస్థానం తీర్పు ఎలా ఉన్నప్పటికీ, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు సముచిత ప్రాతినిధ్యం కల్పించి తీరుతామని గల్లా మాధవి స్పష్టం చేశారు. బీసీల రాజకీయ, ఆర్థిక, సామాజిక సాధికారతే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ఆ దిశగానే తమ కార్యాచరణ ఉంటుందని ఆమె వివరించారు.

స్థానిక ఎన్నికలు ఆపేందుకు వైసీపీ కుట్ర

▶ మంత్రి కొల్లు రవీంద్ర

(మొదటి పేజీ తరువాయి)



సంఘం నిధులు సాధించాలంటే ఎన్నికల నిర్వహణ తప్పనిసరని, ఈ క్రమంలో ప్రభుత్వం ముందుకు వెళుతుంటే.. ఓటమి భయంతో వైసీపీ మరోసారి కోర్టులను ఆశ్రయించి ఎన్నికల ప్రక్రియను అడ్డుకోవాలని చూస్తోందని ఆరోపించారు. రాష్ట్ర అభివృద్ధికి కీలకమైన రూ.12,500 కోట్లు రాకుండా అడ్డుకోవడమే వారి దురుద్దేశమని విమర్శించారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో గ్రామీణ వ్యవస్థ సర్వనాశనమైందని కొల్లు రవీంద్ర మండిపడ్డారు. రాజశేఖర్ రెడ్డి హయాం నుంచే బీసీల ఎదుగుదలను అడ్డుకుంటున్నారని, జగన్ పాలనలో తోట చంద్రయ్య, నందం సుబ్బయ్య వంటి బీసీ నేతల హత్యలు జరిగాయని ఆరోపించారు. ఇప్పుడు కల్లబొల్లి మాటలతో బీసీలను మభ్యపెట్టాలని చూస్తున్నారని, వారి నాటకాలను బీసీ సోదరులు ఎట్టిపరిస్థితుల్లోనూ నమ్మరని హితవు పలికారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం బీసీ కార్పొరేషన్లకు నిధులు కేటాయిస్తోందని, నాయీ బ్రాహ్మణులకు ఉచిత విద్యుత్, గీత కార్మికులకు మద్యం దుకాణాల్లో రిజర్వేషన్లు వంటి హామీలను నెరవేరుస్తోందని వివరించారు. చట్టపరంగా అన్ని అడ్డంకులను అధిగమించి బీసీలకు న్యాయం చేస్తామని, రాష్ట్ర అభివృద్ధి కోసం ఎన్నికలు నిర్వహించి తీరుతామని కొల్లు రవీంద్ర స్పష్టం చేశారు.

'సర్' అక్రమాలపై సుప్రీం విచారణ జరపాలి..

సీఈసీ రాజీనామా చేయాలి: కేటీఆర్



హైదరాబాదు, అక్టోబర్ 09 :


ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (సర్) ప్రక్రియలో భారీ అక్రమాలు జరిగాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధ్వజమెత్తారు. జరిగిన అక్రమాలపై తీవ్ర స్థాయిలో స్పందించారు. ఈ వ్యవహారంపై సుప్రీంకోర్టు సుమోటోగా విచారణ చేపట్టి, సిట్టింగ్ జడ్జితో స్వతంత్ర దర్యాప్తు జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. అదే సమయంలో, చీఫ్ ఎలక్షన్ కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని కోరారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా కేటీఆర్ ఒక ప్రకటన విడుదల చేశారు. భారత రాజ్యాంగానికి మించింది ఏదీ లేదని, ఏ ఒక్క భారత పౌరుడి ఓటు హక్కును హరించలేరని ఆయన స్పష్టం చేశారు. ఒక వ్యక్తిని కాపాడటం కోసం 140 కోట్ల మంది భారతీయుల హక్కులను ఎలా కాలరాస్తారని ప్రశ్నించారు. ప్రజాస్వామ్యానికి మూలస్తంభమైన ఓటు హక్కును బలహీనపరిచే కుట్రలపై న్యాయవ్యవస్థ జోక్యం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. సర్ ప్రక్రియలో భాగంగా, ముఖ్యంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాల్లో భారీ ఎత్తున ఓటర్ల పేర్లను తొలగించారని ఆయన ఆరోపించారు. మరోవైపు, రేపు హైదరాబాద్‌లోని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టనున్నట్లు బీఆర్ఎస్ పార్టీ ప్రకటించింది. ఈ ఆందోళనలను భవిష్యత్తులో ఢిల్లీకి కూడా విస్తరిస్తామని పార్టీ వర్గాలు తెలిపాయి.

ఈనెల 16న విశాఖలో..

వైసీపీ 'ఉత్తరాంధ్ర బీసీ గర్జన'

- బీసీ రిజర్వేషన్లపై ప్రభుత్వ విధానాలను ఎండగట్టడమే లక్ష్యమన్న వైసీపీ
- బీసీలను చంద్రబాబు మోసం చేస్తున్నారని ఆరోపణ
- ఈ అంశాన్ని ప్రజల్లోకి తీసుకెళతామని వెల్లడి

విశాఖపట్నం, అక్టోబర్ 09 :



ఉత్తరాంధ్రలోని బీసీ వర్గాల గొంతుకను బలంగా వినిపించేందుకు వైసీపీ సిద్ధమైంది. ఇందులో భాగంగా ఈ నెల 16వ తేదీన విశాఖపట్నంలో 'ఉత్తరాంధ్ర బీసీ గర్జన' పేరుతో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు ప్రకటించింది. ఈ సభకు ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి పార్టీకి చెందిన బీసీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్దఎత్తున హాజరుకానున్నారని తెలిపింది. ప్రధానంగా రెండు కీలక అంశాలపై ప్రభుత్వ విధానాలను ఎండగట్టడమే లక్ష్యంగా ఈ సభను నిర్వహిస్తున్నట్లు వైసీపీ వర్గాలు తెలిపాయి. రిజర్వేషన్ల విషయంలో చంద్రబాబు ప్రభుత్వం బీసీలను మోసం చేస్తోందని ఆరోపిస్తూ, ఈ అంశాన్ని ప్రజల్లోకి తీసుకెళతామని వెల్లడించాయి. అదే సమయంలో రాష్ట్రంలో తమ పార్టీకి చెందిన బీసీ నేతలు, కార్యకర్తలపై జరుగుతున్న భౌతిక దాడులను, అన్యాయాలను ఈ వేదిక నుంచి తీవ్రంగా ఖండించాలని నిర్ణయించినట్లు తెలిపాయి.

ప్రజల విశ్వాసాన్ని ఈసీ కోల్పోతోంది : హరీశ్ రావు

హైదరాబాదు, అక్టోబర్ 09 :



భారత ప్రజాస్వామ్య వ్యవస్థకు ఎన్నికల సంఘం (ఈసీ) వెన్నెముక వంటిదని, అది అధికారంలో ఉన్నవారికి రక్షణ కవచంలా మారకూడదని బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు అన్నారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఎన్నికల సంఘం పనితీరు, నియామకాలపై వస్తున్న ప్రశ్నలతో రాజ్యాంగ పునాదులు బలహీనపడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఓటర్ల జాబితా సవరణలో (సర్) భాగంగా పెద్ద ఎత్తున ఓట్లను తొలగించడం వల్లే ఈసీపై ప్రజలకు నమ్మకం పోతోందన్నారు. 'ప్రజాస్వామ్యం అన్నింటికన్నా గొప్పది. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టడంలో విఫలమైతే, అందుకు బాధ్యత వహిస్తూ సీఈసీ జ్ఞానేశ్ కుమార్ తప్పుకోవాలి' అని హరీశ్ రావు స్పష్టం చేశారు. రాజ్యాంగంలోని ఆర్టికల్స్ 324, 325, 326 ప్రకారం స్వేచ్ఛాయుతమైన, నిష్పక్షపాతమైన ఎన్నికలు జరగాలని గుర్తుచేశారు.

కార్యకర్తలకు గుర్తింపు కార్డులతో

పార్టీకి మరింత బలోపేతం



పుట్టపర్తి, అక్టోబర్ 09, దరువు న్యూస్ :

స్థానిక నియోజకవర్గంలోని పరిగి మండల పరిధిలో బీచగానిపల్లి, శిగుపల్లి, పైడేటి, పి.నరసాపురం, శరేకొలం, వనంపల్లి, ఎర్రగుంట పంచాయతీలకు చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలకు మాజీ మంత్రి, శ్రీ సత్యసాయి జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు, పెనుకొండ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ఉషశ్రీ చరణ్ శుక్రవారం పార్టీ ఐడీ కార్డులను పంపిణీ చేశారు. పార్టీ కోసం నిరంతరం శ్రమిస్తున్న నాయకులు, కార్యకర్తలకు గుర్తింపు, గౌరవం కల్పిస్తూ, పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని గ్రామస్థాయి వరకు మరింత పటిష్టం చేసే దిశగా ఈ కార్యక్రమం నిర్వహించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ప్రతి పంచాయతీలో పార్టీని బలోపేతం చేయడం, నాయకులు, కార్యకర్తల మధ్య సమన్వయాన్ని పెంపొందించడం, ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ వారి సమస్యలపై పోరాడటం లక్ష్యంగా ముందుకు సాగాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. కార్యకర్తలే పార్టీకి అసలైన బలమని చాటిచెబుతూ, ప్రతి కార్యకర్తకు గుర్తింపు, గౌరవం కల్పిస్తూ అందరినీ కలుపుకొని ముందుకు సాగడమే లక్ష్యంగా ఉషశ్రీ చరణ్ గారు చేపట్టిన ఈ కార్యక్రమం పరిగి మండల వైఎస్సార్సీపీ శ్రేణుల్లో నూతనోత్సాహాన్ని నింపింది. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

సనప శ్రీ మాధవరాజులస్వామి క్రికెట్ టోర్నీ ప్రారంభం



అనంతపురం, అక్టోబర్ 9, దరువు న్యూస్ :

ఆత్మకూరు మండల పరిధిలోని సనప గ్రామంలో శ్రీ మాధవరాజుల స్వామి క్రికెట్ టోర్నమెంట్ సీజన్ 3 ఘనంగా ప్రారంభమైంది. గ్రామ పెద్దలు, యువత ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ టోర్నీలో 50 టీములు పాల్గొంటాయి. తొలిరోజు శుక్రవారం ప్రారంభమైన మ్యాచ్‌లో అనంతపురం, కెకె అగ్రహారం జట్లు తలపడ్డాయి. ఈ మ్యాచ్‌లో అనంతపురం టీము గెలుపొందింది. అనంతపురం జట్టులోని బ్యాట్స్‌మెన్ శివారెడ్డి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచారు. ఇతనికి సనప ఓబులేసు, శివారెడ్డిలు కలిసి బ్యాట్స్‌మెన్ శివారెడ్డి అవార్డు అందజేశారు. రెండవ రోజు శనివారం నుంచి మదు మ్యాచ్‌లు జరుగుతాయని నిర్వాహకులు సనప ఓబులేసు తెలిపారు.

పామిడిలో అభివృద్ధి పనులకు భూమిపూజ

టీడీపీలో చేరిన వైసీపీ నేతలు



పామిడి, అక్టోబర్ 09, దరువు న్యూస్ :

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతోందని గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం అన్నారు. పామిడి పట్టణంలో పల్లె పండుగ 3.0 కార్యక్రమంలో భాగంగా అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టడంతోపాటు, వైఎస్సార్‌సీపీకి చెందిన పలువురు నాయకులు తెలుగుదేశం పార్టీలో చేరారు. పామిడి పట్టణంలోని 6, 7వ వార్డుల్లో పల్లె పండుగ 3.0 కార్యక్రమంలో భాగంగా రూ.10 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, ఆయన తనయుడు, గుత్తి, పామిడి ఇన్‌చార్జి గుమ్మనూరు ఈశ్వర్ భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాష్ట్రవ్యాప్తంగా అభివృద్ధి కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తోందన్నారు. గుంతకల్లు నియోజకవర్గంలోనూ అనేక అభివృద్ధి పనులు చేపట్టి, ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని తెలిపారు. కూటమి ప్రభుత్వం అభివృద్ధికి మారుపేరుగా నిలుస్తోందని పేర్కొన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి 100 మంది చేరిక

మరోవైపు, పామిడి పట్టణంలోని పీజీఆర్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీకి చెందిన ప్రముఖ బిల్డింగ్ కాంట్రాక్టర్ అల్లా బకాష్‌తో పాటు ఆయన అనుచరులు సుమారు 100 మంది తెలుగుదేశం పార్టీలో చేరారు. ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, గుమ్మనూరు ఈశ్వర్, కార్మిక బోర్డు చైర్మన్ వెంకట శివుడు యాదవ్ ఆధ్వర్యంలో ఈ చేరికలు జరిగాయి. అంతకు ముందు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, గుమ్మనూరు ఈశ్వర్‌కు పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికాయి. ఎద్దులపల్లి సర్కిల్ నుంచి హనుమాన్ థియేటర్ మీదుగా పీజీఆర్ ఫంక్షన్ హాల్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం పార్టీలో చేరిన వారికి ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, వెంకట శివుడు యాదవ్ పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.

బీసీలకు 34 శాతం రిజర్వేషన్ పై సుప్రీంకోర్టు తీర్పు పట్ల హర్షం

- సీఎం చంద్రబాబుమంత్రి లోకేష్ బాబులకు కృతజ్ఞతలు
- రాష్ట్ర కుంచిటి వక్కలిగా కార్పొరేషన్ చైర్మన్ లక్ష్మీ నారాయణ

మడకశిర, అక్టోబర్ 09, దరువు న్యూస్ :

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో బిసిలకు 34 శాతం రిజర్వేషన్ అవకాశం కల్పిస్తూ సుప్రీం కోర్టు తీసుకున్న నిర్ణయం పట్ల రాష్ట్ర కుంచిటి వక్కలిగా కార్పొరేషన్ చైర్మన్ తమ హర్షం వ్యక్తం చేశారు. మడకశిర పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం మీడియాతో అయన మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34శాతం రిజర్వేషన్ కల్పిస్తూ ఏపీ ప్రభుత్వం జారీ చేసిన జీవోలను కొట్టివేస్తూ హైకోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు సమర్థించడం మంచి శుభపరిణామమన్నారు. శుక్రవారం సుప్రీంకోర్టులో ఏపీ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్ ను ధర్మాసనం డిస్మిస్ చేసిందన్నారు. 50శాతం సీలింగ్ దాటకూడదని చెప్పి హైకోర్టు తీర్పును సమర్థించిందన్నారు. ఈ తీర్పును తాము మర్యాద పూర్వకంగా గౌరవిస్తున్నామన్నారు. బీసీలకు 34శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ చంద్రబాబు గతంలో జీవో నెంబర్లు .105, 1065 ఇచ్చి బాటలు వేస్తే, తాడేపల్లి ప్యాలెస్ డైరెక్షన్ లో వైసీపీ నేత శివప్రసాద్ రెడ్డి చేత పిటిషన్ వేయించి అడ్డుకున్నారని అయన గుర్తు చేశారు. వైసీపీ హయాంలో సుప్రీంకోర్టుకు వెళ్లకుండా వదిలేసి బీసీలకు తీరని ద్రోహం చేశారని అయన ఆవేదన వ్యక్తం చేశారు. దానివల్ల 16,800 మంది బీసీలు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, మేయర్లు అయ్యే అవకాశం కోల్పోయారని చైర్మన్ గుర్తు చేశారు. టీడీపీతోనే బీసీలకు న్యాయం జరిగిందని అయన ఆనందం వ్యక్తం చేశారు. సుప్రీంకోర్టు తీర్పు వచ్చినా, మా చిత్తశుద్ధి మారలేదన్నారు. కూటమి ప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీతో ఢిల్లీలో గట్టిగా వాదించడం ఎంతో అభినందనీయమన్నారు. కోర్టు తీర్పు ప్రభుత్వ పరంగా వ్యతిరేకంగా వచ్చినా, పార్టీ పరంగా బీసీలకు 34 శాతం రిజర్వేషన్ కల్పించేందుకు సీఎం కట్టుబడి ఉన్నారన్నారు.ఇదే విషయాన్ని మంత్రి నారా లోకేష్ కూడా స్పష్టం చేశారని చైర్మన్ తెలిపారు. 1987లో 20 శాతం, 1995లో 34 శాతం రిజర్వేషన్ ఇచ్చింది తెలుగుదేశం పార్టీనేనాన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కోర్టుతో సంబంధం లేకుండా పార్టీ పరంగా 34 శాతం సీట్లు బీసీలకే ఇవ్వడం జరుగుతుందన్నారు. మేయర్, మున్సిపల్ చైర్మన్, జెడ్పీ చైర్మన్, కౌన్సిలర్లు, వార్డు సభ్యుల్లో బీసీలకు సముచిత స్థానం కల్పిస్తామన్నారు. బీసీలను ఓటు బ్యాంకుగా చూసేది గొడ్డలి పార్టీ మాత్రమేనని అయన తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. బీసీలను రాజ్యాధికారం వైపు నడిపించేది తెలుగుదేశం పార్టీ ఒక్కటే నని చైర్మన్ తెలిపారు. బీసీల అభ్యున్నతి, సామాజిక న్యాయం తెలుగుదేశంతోనే సాధ్యమవుంతుశీదన్నారు. సుప్రీంకోర్టులో బిసిలకు తగిన న్యాయం చేస్తూ తీర్పు రావడంతో బీసీలకు టిడిపి అండగా ఉంటుందని చైర్మన్ లక్ష్మీ నారాయణ భరోసా ఇచ్చారు.



జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలి

- సర్ ప్రక్రియను రద్దు చేయాలి
- ఓట్ల తొలగింపును తక్షణమే ఆపాలి
- టవర్ క్లాక్ వద్ద విద్యార్థి, యువజన సంఘాల నిరసన ర్యాలీ

అనంతపురం, అక్టోబర్ 9, దరువు న్యూస్ :

చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని, సర్ ప్రక్రియను రద్దు చేయాలని, ఓటర్ల జాబితా నుంచి ఓట్ల తొలగింపును తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం నగరంలోని టవర్ క్లాక్ వద్ద విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థి, యువజన సంఘాల నాయకులు మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి అనుకూలంగా ఎన్నికల సంఘం వ్యవహరిస్తోందని విమర్శించారు. దేశంలో ప్రజాస్వామ్య వ్యవస్థను, ఎన్నికల ప్రక్రియ పారదర్శకతను కాపాడాల్సిన ఎన్నికల సంఘం నిష్పక్షపాతంగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు. మూడోసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం ఎన్నికల సంఘాన్ని ఉపయోగించుకుని ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు ప్రయత్నిస్తోందని నాయకులు ఆరోపించారు. ఓటర్ల జాబితా నుంచి అర్హులైన ఓటర్ల పేర్లు తొలగించే చర్యలు ప్రజాస్వామ్య హక్కులకు విఘాతం కలిగిస్తాయని పేర్కొన్నారు. ప్రతి పౌరుడికి ఓటు హక్కు అత్యంత కీలకమని, ఎలాంటి కారణాలతోనైనా అర్హులైన ఓటర్ల ఓటు హక్కును హరించే చర్యలను సహించబోమని స్పష్టం చేశారు. ఎసఐఆర్ ప్రక్రియ పేరుతో ఓటర్లలో అందోళన కలిగించే పరిస్థితులు ఏర్పడుతున్నాయని నాయకులు పేర్కొంటూ, ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ పారదర్శకంగా, నిష్పక్షపాతంగా జరగాలని కోరారు. ప్రజాస్వామ్య విలువలను కాపాడేందుకు ఎన్నికల సంఘం రాజ్యాంగబద్ధంగా తన బాధ్యతలను నిర్వర్తించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓతూరి పరమేష్, డీవైఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి కసాపురం రమేష్, ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు పృథ్వి, ఏఐఎస్ఎఫ్ నగర కార్యదర్శి సమీర్, ఏఐఎస్ఏ జిల్లా కార్యదర్శి శివకుమార్, పీడీఎస్‌యూ నగర కార్యదర్శి శంకర్, పీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు అబ్దుల్ అలాం, ఏఐఎస్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు నరసింహులు, యూఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి భీమేష్, ఏఐఎఫ్‌డీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు సిద్ధు, సీజేపీ అనంతపురం జిల్లా నాయకులతో పాటు ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు తరిమెలగిరి, డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు సురేందర్, సునీల్, పిఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షురాలు ప్రతిభ, ఏఐఎస్ఏ జిల్లా అధ్యక్షుడు బాలు, ఏఐఎస్ఎఫ్ నగర అధ్యక్షులు సుకృత్, ఎస్ఎఫ్ఐ పట్టణ నాయకులు వంశీ మహేష్ నాగభూషణ్ వివిధ విద్యార్థి, యువజన సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



రేవంత్ రెడ్డి కుటుంబం ఓ అనకొండ ఫ్యామిలీ : మన్నె క్రిశాంక్

- 817 ఎకరాల ప్రభుత్వ భూమి తాకట్టు పెట్టి రూ.12,818 కోట్ల రుణం తీసుకున్నారు



హైదరాబాదు, అక్టోబర్ 09 :

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కుటుంబం తెలంగాణలో అక్రమాస్తులు కూడగడుతూ 'అనకొండ ఫ్యామిలీ'గా మారిందని బీఆర్ఎస్ నేత మన్నె క్రిశాంక్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వంపై సంచలన విమర్శలు చేశారు. హైదరాబాద్‌లోని ఇజ్జత్ నగర్, మోకిల, మియాపూర్, ఇంజాపూర్, చిలుకూరు, పటాన్‌చెరు, గాజులరామారం, జవహర్ నగర్ వంటి అత్యంత విలువైన ప్రాంతాల్లోని 817 ఎకరాల భూమిని తాకట్టు పెట్టి రూ.12,818 కోట్లకు పైగా రుణాలు సమీకరించారని ఆయన ఆరోపించారు. ఈ భూముల మార్కెట్ విలువ ఎకరానికి రూ.150 కోట్లకు పైగా ఉండగా, కేవలం రూ.15 కోట్లుగా చూపించి రుణాలు పొందారని విమర్శించారు. తాకట్టు పెట్టిన భూమిలో కేఎల్ఎస్ఆర్ ఇన్ఫ్రా సంస్థ ఎలా కంటైనర్లను ఏర్పాటు చేసిందని ఆయన ప్రశ్నించారు. తాను అక్రమాస్తులపై ప్రశ్నిస్తుంటే నిజం బయట పడుతుందన్న భయంతోనే ముఖ్యమంత్రి, ఆయన బృందం స్పందించడం లేదని క్రిశాంక్ అన్నారు. తాను వ్యక్తిగత ఆస్తుల గురించి కాకుండా, తెలంగాణ సంపద గురించే ప్రశ్నిస్తున్నానని, ఎన్ని బెదిరింపులు వచ్చినా రాష్ట్ర వనరుల పరిరక్షణకు పోరాడుతూనే ఉంటానని స్పష్టం చేశారు.

ఒకే పథకాన్ని చంద్రబాబు 22 సార్లు ప్రారంభించారు

- వైసీపీ ప్రధాన కార్యదర్శి లక్ష్మీపార్వతి ఫైర్
- చంద్రబాబు పాలనంతా ప్రచార ఆర్భాటమేనని లక్ష్మీపార్వతి విమర్శ
- ఒకే పెన్షన్ పథకాన్ని 22 సార్లు ప్రారంభించారని ఆరోపణ
- రాయలసీమ కరవును, రైతుల కష్టాలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఫైర్

అమరావతి, అక్టోబర్ 09 :

ముఖ్యమంత్రి చంద్రబాబు పాలనంతా ప్రచార ఆర్భాటమే తప్ప ప్రజలకు చేసిందేమీ లేదని వైసీపీ ప్రధాన కార్యదర్శి లక్ష్మీపార్వతి తీవ్రస్థాయిలో విమర్శించారు. శుక్రవారం ఆమె మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అబద్ధాలు, రాజకీయ నాటకాలతో ప్రజలను మభ్యపెడుతోందని మండిపడ్డారు. చేసిన పనులనే మళ్లీ మళ్లీ చేస్తూ, చెప్పిన విషయాలనే పదే పదే చెబుతూ ప్రచారం చేసుకోవడమే పనిగా పెట్టుకున్నారని ఆమె ఆరోపించారు. 'ఒకే పెన్షన్ పథకాన్ని 22 సార్లు ప్రారంభించడం చంద్రబాబు ప్రచార పిచ్చికి నిదర్శనం. కొత్తగా ఒక్కరికైనా పెన్షన్ ఇచ్చారా?' అని లక్ష్మీపార్వతి ప్రశ్నించారు. జగన్ హయాంలో చేపట్టిన భోగాపురం విమానాశ్రయం పనులను, రూపొందించిన పట్టాదారు పాసు పుస్తకాలను ఇప్పుడు చంద్రబాబు తన ఖాతాలో వేసుకుని ప్రచారం చేసుకుంటున్నారని విమర్శించారు. బీసీల ఓట్ల కోసం 34 శాతం రిజర్వేషన్ల పేరుతో కొత్త నాటకానికి తెరతీశారని, న్యాయస్థానాల్లో నిలబడని ఈ అంశాన్ని కూడా జగన్‌కు ఆపాదించడం దుర్మార్గమని అన్నారు. రాయలసీమలో కరవు విలయతాండవం చేస్తోందని, పంటలు ఎండిపోతున్నా రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని లక్ష్మీపార్వతి ఆవేదన వ్యక్తం చేశారు. టమాటా, మిర్చి, పొగాకు రైతుల కష్టాలు చంద్రబాబుకు కనిపించడం లేదా? అని నిలదీశారు. సూపర్ సిక్స్ హామీల అమలులో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని.. డ్వాక్రా మహిళలను, నిరుద్యోగులను, రైతులను మోసం చేసిందని ఆరోపించారు. రాష్ట్రంలో భూకబ్జాలు పెరిగిపోయాయని, ప్రతిపక్షాల గొంతు నొక్కుతూ 'రెడ్‌బుక్ రాజ్యాంగం' అమలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. జగన్ పాలనను విధ్వంసం అంటున్న చంద్రబాబు... ఆయన స్వర్ణ పాలనపై బహిరంగ చర్చకు సిద్ధమా? అని లక్ష్మీపార్వతి సవాల్ విసిరారు. విద్య, వైద్యం, వ్యవసాయం, మహిళా సంక్షేమం వంటి అంశాల్లో ఎవరి పాలనలో ఏం జరిగిందో చర్చిద్దామని ఆమె అన్నారు. ప్రజల సమస్యలను పక్కనపెట్టి చంద్రబాబు, లోకేశ్, పవన్ కల్యాణ్ రాజకీయ ప్రచారానికే ప్రాధాన్యం ఇస్తున్నారని ఆమె విమర్శించారు.



రైతుల భూమికి భరోసా.. గ్రామాల అభివృద్ధికి ఓటే ఆయుధం





బొమ్మనహాల్, అక్టోబర్ 9, దరువు న్యూస్ :

రైతుల భూములకు పూర్తి భద్రత కల్పిస్తూ, గ్రామాల అభివృద్ధి, ప్రజల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని రాయదుర్గం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. బొమ్మనహాల్ మండలం నేమకల్లు గ్రామంలో శుక్రవారం సాయంత్రం రైతులకు రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్‌పుస్తకాలను పంపిణీ చేసిన అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత వైకాపా ప్రభుత్వ పాలనలో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని, ముఖ్యంగా రైతుల భూముల విషయంలో అనేక అనుమానాలు తలెత్తేలా అప్పటి ప్రభుత్వం వ్యవహరించిందని విమర్శించారు. పట్టాదారు పాస్‌పుస్తకాలపై అప్పటి ముఖ్యమంత్రి జగన్ రెడ్డి చిత్రాలను ముద్రించడంతో పాటు, భూముల సర్వే రాళ్లపైనా చిత్రాలను వేయడం ద్వారా రైతుల్లో ఆందోళన కలిగించారని ఆరోపించారు.గత ప్రభుత్వం తీసుకొచ్చిన భూముల యాజమాన్య హక్కుల చట్టాన్ని రద్దు చేసి, రైతులకు తమ భూములపై పూర్తి హక్కులు కల్పించేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్‌పుస్తకాలను అందజేస్తోందన్నారు. రైతులు తమ భూముల విషయంలో ఎలాంటి అందోళన చెందాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు.ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రభుత్వం పనిచేస్తోందని పేర్కొన్న ఎమ్మెల్యే, సామాజిక పింఛన్ల పెంపుతో పాటు రైతులకు అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలను వివరించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తున్నట్లు తెలిపారు.నేమకల్లు గ్రామంలో అభివృద్ధి పనులు చేపట్టి ప్రజల రాకపోకలకు మెరుగైన సౌకర్యాలు కల్పించామని, తాగు నీటి సమస్య పరిస్కారానికి చర్యలు తీసుకున్నామని చెప్పారు.గత ఎన్నికల్లో ప్రజలు వేసిన ఓటు వల్లే అభివృద్ధి పనులు సాధ్యమాయ్యాయని పేర్కొన్నారు.రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ ప్రజలు ఇదే ఆదరణ చూపించి కూటమి అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ప్రజల మద్దతుతో మరిన్ని అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టేందుకు అవకాశం కలుగుతుందని కాలవ శ్రీనివాసులు అన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు కురుబ మల్లెన్న, ఏకసభ్య సహకార సంఘం అధ్యక్షుడు కొత్తపల్లి మల్లికార్జున, గాలిబసప్ప, ఆర్యవైశ్య కార్పొ రేషన్ సంచాలకుడు నాగళ్లి రాజు, మాజీ మండల కన్వీనర్ బలరామిరెడ్డి, కుమ్మరి మల్లికార్జున, తుంగభద్ర ప్రాజెక్టు కమిటీ ఉపాధ్యక్షుడు కేశవరెడ్డి, కేషన్న, హరేసముద్రం తిప్పేస్వామి, మల్లీడు శ్రీనివాసులు పాల్గొన్నారు.

పామిడిలో సేవా సంకల్ప్ అభియాన్ కార్యక్రమం



పామిడి, అక్టోబర్ 09, దరువు న్యూస్ :

పామిడి పట్టణంలోని శ్రీ సరస్వతి విద్యా మందిరంలో సేవా సంకల్ప్ అభియాన్‌లో భాగంగా 25 కోట్ల చిన్నారుల కలల చిత్రలేఖ పోటీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం ప్రధానాచార్యులు సీఆర్ శ్రీనివాస రావు, బీజేపీ మండల అధ్యక్షులు చౌహాన్ అంజినాయక్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా బీజేపీ రాష్ట్ర ఆల్ సేల్స్ కన్వీనర్, మాజీ ఆర్మీ జేసీఓ కణంపల్లి చిరంజీవి రెడ్డి, అనంతపురం జిల్లా బీజేపీ అధ్యక్షులు కొనకొండ్ల రాజేష్‌లు హాజరయ్యారు. చిత్రలేఖ పోటీలో దాదాపు 250 మంది విద్యార్థులు పాల్గొన్నారు. 6,7,8 తరగతులకు ఒక విభాగంగా, 9,10 తరగతులకు మరో విభాగంగా పోటీలు నిర్వహించారు. మొదటి విభాగం (6,7,8 తరగతులు) ఎం.హర్షద్ కుమార్, వై.వైష్ణవి, రెండో విభాగం (9,10 తరగతులు) పి.ఉషశ్రీ, ఎన్.జయలక్ష్మి, మహీధర్ రెడ్డి, కేపీ ముకేష్ రెడ్డి, కరిష్మా, హిమబిందు విజేతలుగా గెలుపొందారు. గెలుపొందిన విద్యార్థులకు ముఖ్యఅతిథుల చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో గార్లదిన్నె బీజేపీ మండల అధ్యక్షులు చాణిక్య, ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు మనోజ్ కుమార్, పవన్ కుమార్, హాస్పిటల్ అభివృద్ధి కమిటీ మెంబర్ పూజారి లక్ష్మీదేవి, రాజశేఖర్ గౌడ్, ఆర్ఎస్ఎస్ పెద్దలు పుల్లా చౌడయ్య, యువ మోర్చా మండల అధ్యక్షులు నరేంద్ర, విష్ణుకాంత్ రావు, ఓబీసీ మోర్చా మండల అధ్యక్షులు నరేష్ యాదవ్, రామ్ నరేష్, సరస్వతి విద్యా మందిరం ఉపాధ్యాయులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

టిడ్కో గృహాలను పరిశీలించిన చైర్మన్



పామిడి, అక్టోబర్ 09, దరువు న్యూస్ :

పామిడి పట్టణంలో నిర్మించిన టిడ్కో గృహాలను జనసేన పార్టీ రాష్ట్ర నాయకులు ఆంధ్రప్రదేశ్ టౌన్‌షిప్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీ టిడ్కో) చైర్మన్ వేములపాటి అజయ్ కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన జరుగుతున్నటువంటి పనులను అధికారులను అడిగి తెలుసుకున్నారు. టిడ్కో గృహాలను త్వరితగతిన నిర్మాణాలు పూర్తి చేసి లబ్ధిదారులకు అందించే లక్ష్యంతో పనిచేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ గుంతకల్ నియోజకవర్గం సమన్వయకర్త వాసగిరి మణికంఠ, జనసేన పార్టీ పామిడి మండల అధ్యక్షులు ధనుంజయ, మండల నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని వారికి స్వాగతం పలికారు.

కృష్ణవేణి పాఠశాలలో ముందస్తు దసరా వేడుకలు

- అమ్మవార్ల అవతారాల్లో అలరించిన చిన్నారులు



పామిడి, అక్టోబర్ 09, దరువు న్యూస్ :

స్థానిక కృష్ణవేణి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ నందు దసరా పండుగను పురస్కరించుకొని ముందస్తు దసరా సంబరాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. నవరాత్రి ఉత్సవాల విశిష్టతను చాటిచెప్పేలా పాఠశాల విద్యార్థినులు శ్రీ దుర్గాదేవి నవదుర్గల అవతారాలలో అలంకృతులై ప్రత్యేక ప్రదర్శనలు ఇచ్చారు. ఈ వేడుకల్లో భాగంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలలో చిన్నారులు అమ్మవారి వేషధారణలతో వేదికపై చేసిన నృత్యాలు, ప్రదర్శనలు వీక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. చేతిలో త్రిశూలం వీణ చెరకుగడ వంటి ఆయుధాలు, సాంప్రదాయ ఆభరణాలు ధరించి లయబద్ధమైన నృత్యాలతో అలరించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ ఆర్.అనురాధరెడ్డి మాట్లాడుతూ.. భారతీయ సంస్కృతి సాంప్రదాయాలు పండుగల విశిష్టతలను నేటి తరానికి తెలియజేసే ఉద్దేశంతోనే పాఠశాలలో ఇలాంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. చిన్నారులలో దాగి ఉన్న ప్రతిభను సృజనాత్మకతను ప్రోత్సహించడానికి ఇలాంటి వేడుకలు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు. కార్యక్రమం అనంతరం అమ్మవార్ల అవతారాల్లో మెరిసిన విద్యార్థినులతో కలిసి పాఠశాల కరస్పాండెంట్ ఆర్.అనురాధ రెడ్డి ఉపాధ్యాయినీలు, సిబ్బంది గ్రూప్ ఫోటోలు దిగి సందడి చేశారు.

విద్యార్థులకు దుస్తుల పంపిణీ



అనంతపురం, అక్టోబర్ 09, దరువు న్యూస్ :

నిత్యసురభి చారిటబుల్ ట్రస్ట్, పుట్టినిల్లు ఆశ్రమం చైర్పర్సన్ డాక్టర్ ఎస్.నిర్మలమురళి, ట్రస్ట్ ఉపాధ్యక్షుడు కవీన్ ఆదిత్య చేతుల మీదుగా దసరా పండుగ సందర్భంగా విద్యార్థులకు నూతన దుస్తులు అందించారు. కోవూరు నగర్‌లో ఉన్న ఎయిమ్ ఫర్ సేవ, శ్రీ స్వామి దయానంద సరస్వతి ఆశ్రమంలో 15 మంది విద్యార్థులకు శుక్రవారం సాయి ఆదిత్య కన్స్ట్రక్షన్ అధినేత పురుషోత్తమ మురళీకృష్ణ సహకారంతో విద్యార్థులకు కొత్త దుస్తులతో పాటు స్వీట్స్, చాక్లెట్లు అందించామని వారు తెలిపారు. ఈ సందర్భంగా నిర్మలమురళీ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ దసరా పండుగను సంతోషంగా జరుపుకోవాలని కోరారు. ఆశ్రమాల్లోనూ ఇతర ప్రాంతాల్లోనూ ఉన్న నిస్సహాయులు, అనాథలు వారు తమకు ఎవరూ లేరు, పండుగలు చేసుకోలేమనే ఆలోచనను వీడి సంతోషంగా తమతోనే అందరూ ఉన్నారని భావించి పండుగలు చేసుకోవాలన్నారు. మనిషి సంతోషంగా ఉన్నప్పుడే అసలైన పండుగ ఉంటుందని తెలుసుకోవాలన్నారు. ఆ దేవుడి ఆశీస్సులు అందరిపై ఉండి ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో సంతోషంగా దసరా, దీపావళి పండుగలను చేసుకోవాలని కోరారు. బాధ్యతగా వీలున్న కొంత మంది అవసరంలోనూ ఆపదలోను ఉన్నవారికి సహాయ సహకారాలు అందించాలని కోరారు. కార్యక్రమంలో స్వామి సత్యాత్మానంద, మేనేజర్ చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.

బీసీల ద్రోహి సీఎం చంద్రబాబు

- బీసీ పార్టీ అంటూనే బీసీలను మోసం చేశారు
- బీసీల ఓట్లతో అధికారంలోకి వచ్చి, బీసీలకే వెన్నుపోటు పొడిచారు
- బీసీలకు 34 శాతం రిజర్వేషన్ల పేరుతో పార్లమెంట్‌లో చట్టం చేయకుండా న్యాయస్థానాలతో దొంగ నాటకాలు ఆడుతున్న చంద్రబాబు
- అంబేద్కర్ విగ్రహం ఎదుట వైసీపీ బీసీ విభాగం ఆధ్వర్యంలో భారీ నిరసన
- వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రమేష్ గౌడ్





అనంతపురం, అక్టోబర్ 09, దరువు న్యూస్ :

టీడీపీ బీసీల పార్టీ అని చెప్పుకుంటూ చంద్రబాబు ప్రతిసారీ అధికారంలోకి వస్తున్నారని, గద్దెనెక్కిన తర్వాత మాత్రం బీసీలను నట్టేట ముంచుతున్నారని వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రమేష్ గౌడ్ విమర్శించారు. శుక్రవారం అనంతపురం నగరంలోని జిల్లా పరిషత్ కార్యాలయం వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి ఆయన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రమేష్ గౌడ్ మాట్లాడుతూ.. మొత్తం రిజర్వేషన్లు 50శాతం దాటుతున్నాయన్న కారణంతో 34 శాతం బీసీ రిజర్వేషన్ల జీవోలను హైకోర్టు కొట్టివేసింది. ఆ తీర్పుపై ప్రభుత్వం వేసిన పిటిషన్‌ను ఈరోజు సుప్రీంకోర్టు కూడా కొట్టివేసింది. 50శాతం పరిమితి ఉందని ముందే తెలిసి కూడా, రాజ్యాంగ సవరణ లేదా పార్లమెంట్‌లో చట్టం కోసం ప్రయత్నించకుండా కోర్టులో నిలవని జీవోలు ఇచ్చి చంద్రబాబు నాటకం ఆడారని ఆరోపించారు. కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వంలో టీడీపీ భాగస్వామి అయినా బీసీల కోసం పార్లమెంట్‌లో ఎందుకు బిల్లు పెట్టించలేదని వారు ప్రశ్నించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఎన్నికల సమయంలో బీసీలకు ఎన్నో హామీలు ఇచ్చి, వారి ఓట్లతో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ఇప్పుడు అదే బీసీలకు వెన్నుపోటు పొడుస్తున్నారని ఆరోపించారు. బీసీలను కేవలం ఓటు బ్యాంకుగానే చూస్తున్నారని, వారి సంక్షేమాన్ని, అభివృద్ధిని పూర్తిగా విస్మరించారని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుంచి రాష్ట్రవ్యాప్తంగా బీసీలపై దాడులు చేస్తూ, అక్రమ కేసులు పెడుతున్నారని రమేష్ గౌడ్ ఆరోపించారు. బీసీల పార్టీ అని చెప్పుకుంటూనే చంద్రబాబు బీసీలను మోసం చేస్తున్నారని అన్నారు. రిజర్వేషన్ల విషయంలో కూటమి ప్రభుత్వం బీసీలకు అన్యాయం చేసిందని ధ్వజమెత్తారు. చంద్రబాబు బీసీల ద్రోహిగా చరిత్రలో మిగిలిపోతారని వ్యాఖ్యానించారు. బీసీలను గౌరవించి, వారికి ఉన్నత పదవులు ఇచ్చిన ఘనత గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానిదేనని రమేష్ గౌడ్ గుర్తుచేశారు. బీసీలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా మోసం చేస్తున్న కూటమి ప్రభుత్వానికి రాబోయే రోజుల్లో బీసీలే తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. బీసీల హక్కుల కోసం వైఎస్సార్‌సీపీ పోరాటం కొనసాగిస్తుందని, అవసరమైతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం చేపడతామని స్పష్టం చేశారు. "ఖబడ్దార్ చంద్రబాబు, బీసీలను మోసం చేస్తే ఊరుకునేది లేదు' అని హెచ్చరించారు.

అనంతరం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర బీసీ నాయకులు కేవీ రమణ, మీసాల రంగన్న, రిలాక్స్ నాగరాజు, చింతకుంట మధు మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు ఇస్తామని చెప్పి చంద్రబాబు బీసీలను మోసం చేస్తున్నారని, చంద్రబాబు బీసీలకు చేస్తున్న మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్తామని, పార్టీ అధినేత వైయస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్రంలోని బీసీల పక్షాన నిలబడతామని నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కొగటం విజయ భాస్కర్ రెడ్డి, చింత సోమశేఖర్ రెడ్డి, ఓబి రెడ్డి, చామలూరు రాజ గోపాల్, సాకే చంద్ర శేఖర్, సంపంగి రామాంజనేయులు, ఎద్దుల అమర్‌నాథ్ రెడ్డి, వేముల నదీం, ఉమ్మడి మదన్ మోహన్ రెడ్డి, అనిల్ కుమార్ గౌడ్, మొఘల్ సైపుల్లా బేగ్, ధన, సీఎం బాలాజీ, హేమ కిరణ్, నరేంద్ర, అంజలి, భారతి, కృష్ణవేణి, కమర్తాజ్, దేశాయి భారతీ రెడ్డి, రాధా యాదవ్, శోభా భాయ్, మాలపాటి శ్రీనివాసులు, శ్రీనివాస్ దత్తా, భారతి, మాజీ జడ్పీ వైస్ చైర్ పర్సన్ నాగ రత్నమ్మ, పార్వతి, రామాంజనేయులు, ఫణీంద్ర, దేశాయి భారతీ రెడ్డి, లబ్బె రాఘవ, శ్రీనివాసులు, శేఖర్, గోగుల పుల్లయ్య, రాధా యాదవ్, బెస్త వెంకటేష్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు ఆశీస్సులతోనే ఎమ్మెల్యే అరాచకాలు

- రెండున్నరేళ్లుగా అనంతపురంలో దోపిడీ రాజ్యం
- ఏకంగా మంత్రి బంధువు ఫిర్యాదు చేసినా పట్టించుకోని పోలీసులు
- ఏ పని జరగాలన్నా కూటమి నేతలకు లంచాలివ్వాల్సిన పరిస్థితి
- గతంలో మనం చేసిన అభివృద్ధిని చెప్పుకోలేకపోయాం
- కార్యకర్తలకు గౌరవం పెరిగేలా ముందుకెళ్తాం
- వైసీపీ జిల్లా అధ్యక్షులు అనంత స్పష్టీకరణ
- రుద్రంపేటలో వైసీపీ శ్రేణులకు ఐడీ కార్డులు పంపిణీ





అనంతపురం, అక్టోబర్ 09, దరువు న్యూస్ :

అనంతపురం నగరంలో సీఎం చంద్రబాబు ఆశీస్సులతోనే ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, అతడి అనుచరులు అరాచకాలు కొనసాగిస్తున్నారని వైసీపీ జిల్లా అధ్యక్షులు, అనంతపురం అర్బన్ నియోజకవర్గ సమన్వయకర్త అనంత వెంకట రామిరెడ్డి ధ్వజమెత్తారు. శుక్రవారం సాయంత్రం రుద్రంపేటలోని ఓ ఫంక్షన్ హాల్‌లో వైఎస్ఆర్‌సీపీ నాయకులు, కార్యకర్తలకు ఐడీ కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అనంత మాట్లాడుతూ.. అనంతపురం ఎమ్మెల్యేతో పాటు ఆయన అనుచరులు ఏ మాత్రం భయం లేకుండా ఎలా దోపిడీ చేస్తున్నారో రెండున్నరేళ్లుగా ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. ఏకంగా మంత్రి బంధువు తనకు అన్యాయం జరుగుతోందని ఫిర్యాదు చేసినా పోలీసులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదని అన్నారు. దోపిడీదారులకు ముఖ్యమంత్రి ఆశీస్సులు పుష్కలంగా ఉండడం వల్లే అనంతపురం జిల్లా కేంద్రంలో ఇలాంటి పరిస్థితి వచ్చిందని తెలిపారు. చివరకు సొంతంగా ఒక ఇల్లు కట్టుకోవాలన్నా కూటమి నాయకులకు లంచాలు ఇవ్వాల్సిన పరిస్థితులు ఉన్నాయని అన్నారు. కూటమి పాలనకు రెండున్నరేళ్లు మాత్రమే ఉందని, వీళ్లకు గుణపాఠం చెప్పాలంటే రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్ఆర్‌సీపీని గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. గతంలో ఐదేళ్ల పాటు ప్రజలకు సంక్షేమ పథకాలు అందించినా కార్యకర్తలను విస్మరించి ఓడిపోయిన విషయాన్ని గుర్తు చేశారు. సంక్షేమం, అభివృద్ధి పనులను ప్రజలకు వివరించడంలో విఫలం అయ్యామని అన్నారు. కోవిడ్ వంటి పరిస్థితులు ఉన్నా సంక్షేమ పథకాలు అందించామని, రుద్రంపేట పంచాయతీలో ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టినా సరిగ్గా ప్రచారం చేసుకోలేకపోయామని తెలిపారు. కానీ ఈరోజు చిన్న కాలువ వేసినా నేమ్‌బోర్డులు పెట్టుకుని ప్రచార ఆర్భాటం చేస్తున్నారని అన్నారు. రానున్న రోజుల్లో ప్రతి కార్యకర్తకు న్యాయం చేస్తామని, అందరూ సమిష్టిగా పని చేసి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాలన్నారు. కార్యకర్తలకు గౌరవం పెరిగేలా ఐడీ కార్డులను అందిస్తున్నామని తెలిపారు. ప్రమాదవశాత్తు ఎవరైనా మరణిస్తే రూ.5లక్షలను ఆ కుటుంబానికి అందించనున్నట్లు చెప్పారు. బీసీ రిజర్వేషన్ల పేరుతో చంద్రబాబు మాయమాటలు చెబుతున్నారని దుయ్యబట్టారు. వైఎస్ జగన్ హయాంలో మాత్రమే బీసీలకు న్యాయం జరిగిందని తెలిపారు. సూపర్ సిక్స్ అంటూ అధికారంలోకి వచ్చి మహిళలను, యువతను కూటమి నేతలు మోసం చేశారన్నారు. జిల్లాలో ఎక్కడ చూసినా ప్రజాప్రతినిధులు మట్టి, ఇసుక దందా చేస్తున్నారని మండిపడ్డారు. నవంబర్‌లోగా స్థానిక ఎన్నికలు జరుగుతాయని, అందరూ సిద్ధంగా ఉండాలని సూచించారు.

రాయలసీమను రతనాల సీమగా మార్చడమే సీఎం లక్ష్యం

- మడకశిర బ్రాంచ్ కెనాల్ సామర్థ్యం 642 క్యూసెక్కులకు పెంపు..
- రూ.790 కోట్లతో మడకశిర బ్రాంచ్ కెనాల్ పనులు ప్రారంభించిన మంత్రి సవిత..





పుట్టపర్తి/సోమందేపల్లి, అక్టోబర్ 9, దరువు న్యూస్ :

రాయలసీమను రతనాల సీమగా మార్చడమే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు లక్ష్యమని రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత, జౌళి శాఖల మంత్రి సవిత అన్నారు. శ్రీసత్యసాయి జిల్లా సోమందేపల్లి మండలం పందిపర్తి గ్రామ సమీపంలో హెచ్ఎన్ఎస్-ఎస్ (మడకశిర బ్రాంచ్ కెనాల్ నీటి ప్రవాహ సామర్థ్యాన్ని ప్రస్తుత 408 క్యూసెక్కుల నుంచి 642 క్యూసెక్కులకు పెంచేందుకు రూ.790 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న పనులకు మంత్రి సవిత, ఎంపీ బీకే పార్థసారథితో కలిసి భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను కాంట్రాక్టర్లు కు తెలిపారు. సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం సంక్షేమంతో పాటు అభివృద్ధికి సమాన ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. హెచ్ఎన్ఎస్-ఎస్ కాలువ లైనింగ్ పనులను వేగంగా పూర్తి చేస్తున్నామని, సాగునీటి సదుపాయాల మెరుగుదలతో రైతులకు ప్రయోజనం చేకూరడంతో పాటు ప్రాంతీయ అభివృద్ధికి మరింత ఊతం లభిస్తుందని పేర్కొన్నారు. గొల్లపల్లి రిజర్వాయర్ కారణంగా కియా పరిశ్రమ ఏర్పాటై వేలాది మందికి ఉపాధి అవకాశాలు లభించాయని గుర్తుచేశారు.గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అభివృద్ధి పనుల కంటే రంగులు వేయడానికే ప్రాధాన్యత ఇచ్చారని మంత్రి విమర్శించారు. గత వైసిపి ఐదు సంవత్సరాలుగా జరిగిన అభివృద్ధిపై కూటమి ప్రభుత్వం రెండున్నర సంవత్సరంలో జరిగిన అభివృద్ధిపై చర్చకి రావడానికి ఎప్పుడైనా సిద్ధమని సవాల్ విసిరారు. కూటమి ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించేందుకు కృషి చేస్తోందన్నారు. తల్లికి వందనం పథకం ద్వారా విద్యార్థుల తల్లులకు ఆర్థిక సాయం అందిస్తున్నామని, పల్లె పండుగ కార్యక్రమం ద్వారా ఉపాధి హామీ పథకం కింద గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. మూడు, నాలుగు దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని, రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలను అందజేస్తున్నామని వెల్లడించారు.త్వరలో మండలంలోని పోలేపల్లి నుండి రాచూపల్లి, మరుకుంటపల్లి రోడ్ల నిర్మాణ పనులను త్వరలో ప్రారంభిస్తామని మంత్రి సవిత తెలిపారు. పందిపర్తి గ్రామం పేరును నందిపర్తిగా మార్చే అంశాన్ని అధికారులతో మాట్లాడి గ్రామ పేరును మారుస్తామని తెలిపారు. వైసీపీ నాయకులు అభివృద్ధి పనులపై చర్చకు రావాలని సవాల్ విసిరారు.రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో హిందూపురం పార్లమెంటు కార్యవర్గ సభ్యులు నీరు గంటి చంద్రశేఖర్, రాష్ట్ర ఉప్పర సగర కార్పొరేషన్ చైర్మన్ రంగేపల్లి వెంకటరమణ, రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ డివి ఆంజనేయులు, మండల కన్వీనర్ నడింపల్లి వెంకటేశులు, నాయకులు భాను కీర్తి, కురుబ రామకృష్ణ, సిద్ధ లింగప్ప, కురుబ శ్రీరాములు, కురుబ భాను, పందిపర్తి మాజీ ఎంపీటీసీ నరసింహమూర్తి, పందిపర్తి శ్రీనివాసరెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, సంబంధిత అధికారులు, పార్టీ కార్యకర్తలు ,ప్రజలు పాల్గొన్నారు.

తుమ్మల మారెమ్మకు ప్రత్యేక విశేష పూజలు

గుడిబండ, అక్టోబర్ 09, దరువు న్యూస్ :

మండల కేంద్రమైన గుడిబండ గ్రామ పొలిమేరలో వేలసిన గ్రామ దేవత శ్రీ తుమ్మల మారమ్మకు శుక్రవారం విశేష ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు దేవస్థానం ప్రధాన పూజారప్ప తిప్పేస్వామి తెలిపారు. ఉదయం అమ్మవారికి వివిధ అభిషేకములు,పంచామృతభిషేకం,కుంకుమార్చనలు జరిపి వివిధ రకాల పూలు, పూలమాలలతో ప్రత్యేక అలంకరణ చేసి,నైవేద్యం సమర్పించి,మహా మంగళ హారతినిచ్చి భక్తులకు తీర్థప్రసాదం వితరణ చేశారు. అమ్మవారి సన్నిదానంలో శుక్రవారం సందర్భంగ అమ్మవారి దర్శనం కోసం భక్తులు బారులుతీరి భక్తి శ్రద్దలతో పూజలు జరిపించారు. అమ్మవారు తమ కోరికలను తీర్చినందుకు వారు అమ్మవారి సన్నిదానంలో భక్తులకు అన్నదానం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఈ ప్రాంత వాసులే కాక,ఉమ్మడి అనంతపురము జిల్లా, కర్నాటకలకు చెందిన వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

జనసేన హిందూపురం పార్లమెంట్ నిర్వాహక దళ్ సభ్యుడిగా వెంకటేష్ గుప్తా

మడకశిర, అక్టోబర్ 09, దరువు న్యూస్ :



జనసేన పార్టీ హిందూపురం పార్లమెంట్ నిర్వాహక దళ్ సభ్యుడిగా అఖిల భారత చిరంజీవి మడకశిర అభిమాన సంఘం నియోజకవర్గం అధ్యక్షుడు కెఎస్ వెంకటేష్ గుప్తా నియామకం పట్ల జనసేన పార్టీ శ్రేణులు, చిరంజీవి అభిమానులు తమ హర్షం వ్యక్తం చేసారు. మడకశిర నియోజక వర్గంలో జనసేన పార్టీ అభివృద్ధికి వెంకటేష్ గుప్తా తన వంతు బాధ్యగా ఎంతగానో పాటుపడుతున్న విషయం తెల్సిందేనన్నారు. అయన సేవలను గుర్తించిన జనసేన పార్టీ అధిష్టానం ఎట్టకేలకు ఆయనను హిందూపురం పార్లమెంట్ కార్యనిర్వాహక దళ్ సభ్యుడిగా ఎంపిక చేయడం విశేషం. ఈ సందర్భంగా వెంకటేష్ గుప్తా మాట్లాడుతూ.. పార్టీకోసం తను పాటుపడుతున్న సేవలను గుర్తించిన పార్టీ అధిష్టానం హిందూపురం పార్లమెంట్ కార్యనిర్వాహక సేవాదళ్‌గా నియమించినందుకు కృషి చేసిన చిలకం మధుసూదనరెడ్డి జిల్లా జనసేన పార్టీ అధ్యక్షుడు, జనసేన పార్టీ శ్రేణులకు ఆయన పేరు పేరునా ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.